



# గోపీ లోకం

రంగనాథం ఇంటి మెట్లెక్కుతూ ఆగాడు. గోపీ ఏడుపు సన్నగా వినిపిస్తోంది. "మళ్ళీ ఏమైందీ" అనుకుంటూ నీరసంగా లోపలికెళ్ళాడు. తండ్రిని చూడగానే గోపి ఏడుపు ఎక్కువయ్యింది.

"ఏరా నాన్నా, ఏమయిందమ్మా" అంటూ రంగనాథం గోపీని దగ్గరకు తీసుకున్నాడు.

మోచేతి దగ్గర చూపిస్తూ, గోపీ ఇంకా గట్టిగా ఏడ్చేశాడు.

"స్కూల్లో ఎవరో పిల్లోడు గోపీని కరిచేశాడట" అంది వసంత.

గోపీ మోచేతి దగ్గర కాట్లు లోతుగా దిగి, ఎర్రగా వున్నాయి.

"మొన్నేమో ఒకడు గోళ్ళతో రక్కేశాడు. ఇవేళేమో కరిచేశాడు. మొన్నేగా టీచర్‌తో చెప్పాను. జాగ్రత్తగా చూడమని" అన్నాడు రంగనాథం.

"వీడికేమో ఏమీ తెలియదు. ఎవరు కొట్టినా వాళ్ళనేమీ చెయ్యలేడు. పోనీ ఈ స్కూలు మానిపించేస్తే....".

"ఇంకో స్కూల్లో అయితే మాత్రం ఇలా జరగదని ఏంటీ".

"మరిలాగ ఎన్నాళ్ళు" అంది వసంత గోపీ కన్నీళ్ళు తుడుస్తూ.

"చూడమ్మా, గోపీ. ఎవరన్నా నిన్ను గిల్లినా, కొట్టినా వెంటనే వాళ్ళను నువ్వూ కొట్టాలి. అప్పుడింక వాళ్ళేమీ చెయ్యరు. అసలు నువ్వు వాళ్ళను కొట్టనివ్వకూడదు. చేతులడ్డుపెట్టెయ్యాలి. దూరంగా తోసెయ్యాలి. సరేనా" అన్నాడు రంగనాథం కొడుకు వీపు నిమురుతూ.

గోపీ తలూపాడు.

రంగనాథం నిట్టూర్చాడు. ఇలా తను ఎన్నోసార్లు చెప్పాడు. కానీ, గోపీ ఎవర్నీ ఎదుర్కోలేకపోతున్నాడు. వాడికి చేతకావడం లేదు. మళ్ళీ టీచర్‌కు చెప్పాలి. అంతమంది పిల్లల్లో ఆమె వీడిని ఎంతసేపని కాయగలదు?".

"కాఫీ తీసుకోండి" అనే మాట విని రంగనాథం ఉలిక్కిపడ్డాడు.

కాఫీ తాగి, కప్పు టీపాయ్‌మీద పెట్టి, "టెట్నస్ ఇంజక్షన్ చేయించడం మంచిది. లేపోతే, సెప్టిక్ అయినా అవ్వొచ్చు" అని కుర్చీలోంచి లేచాడు.

గోపీని తీసుకొని దగ్గర్లోనే వున్న క్లినిక్‌కు వెళ్ళాడు రంగనాథం. ఆ క్లినిక్ ముందు గదిలో చాలా మంది వెయిట్ చేస్తున్నారు. ఓ బెంచి చివర కొద్దిగా ఖాళీ వుంటే, అక్కడ గోపీని కూర్చోబెట్టాడు.

ఎక్కడ చూసినా రద్దీయే. సినిమా హాళ్ళ దగ్గర రద్దీ. హొటళ్ళ దగ్గర రద్దీ. హాస్పిటళ్ళ దగ్గర రద్దీ. వర్రీతో రద్దీ. బస్సుల దగ్గర రద్దీ. బస్సుల్లో రద్దీ. గంటల గంటలు వెయిటింగ్. ఆఫీసు నుంచి ఇంటికి రావడానికి ఇవేళ రెండు గంటలు పట్టింది. బస్సు కోసం గంటసేపు ఎదురు చూడాల్సి వచ్చింది. రోజూ మూడు, నాలుగు గంటలు ఆఫీసుకు వెళ్ళి రావడానికే పడుతోంది. ఆఫీసులో ఎనిమిది గంటల పని. రోజూ పదకొండు, పన్నెండు గంటలు ఆఫీసుకే వెచ్చించాల్సి వస్తోంది. ఇలా ఏ ఆస్పత్రికో వస్తే గంటో, గంటన్నరో ఇక్కడ!

బెంచీ కొంచెం ఖాళీ అయితే, గోపీ పక్కన కూర్చున్నాడు రంగనాథం. కళ్ళు మూసుకున్నాడు. గోపీ చేత్తో తట్టేటప్పటికి కళ్ళు తెరిచాడు.

"ఏవిట్రా" అన్నాడు.

అప్పుడే అక్కడికొచ్చిన ఓ వ్యక్తిని చూపించాడు గోపీ నవ్వుతూ.

"వీడికెంత గుర్తో" అనుకుంటూ రంగనాథం అతన్ని పలకరించాడు.

"మీ అబ్బాయి ఎవర్నన్నా ఒకసారి చూస్తే మరచిపోడు. నేనెప్పుడెదురయినా మీవాడు నమస్కారం పెడతాడు" అన్నాడతను.

రంగనాథం చిన్నగా నవ్వి వూరుకున్నాడు.

గోపీ గురించి ఎవరన్నా ఇలాంటి మాటలంటే రంగనాథానికి లోలోపల చాలా ఆనందంగా వుంటుంది.

"అన్నింటిలోనూ ఈ తెలివి తేటలుంటే బావుణ్ను" అనుకున్నాడు రంగనాథం గోపి భుజం మీద చెయ్యేసి.

గోపీకి ఇంక్షన్ చేయించి ఇంటికొచ్చేటప్పటికి రాత్రి తొమ్మిదిన్నరయ్యింది. స్నానం చేశాడు. గోపీ చేత హోంవర్కు చేయించాడు. మామూలు పిల్లలు అరగంటలో చేసేది గోపీకి గంటో, గంటన్నరో పడుతుంది. ఆటల్లో ఎంతోచురుకు. మాట్లాడలేడు.

"మీ వాడికి ఆపరేషన్ చెయ్యాల్సి వుంది. అందుకు కొంత టైమ్ పడుతుంది. అంతవరకూ ఓపిక పట్టండి. ఆపరేషన్ చేస్తే మీ వాడికి మాటొస్తుంది. బాగుపడతాడు" అన్నారు ఇఎన్‌టి స్పెషలిస్టులు.

"వాళ్ళ మాటలే నాకు ధైర్యాన్నిస్తున్నాయి. వాడికి ఆపరేషన్ జరగాలి. ఆ రోజు రావాలి" అనుకున్నాడు రంగనాథం.

"వడ్డించాను రండి"

"గోపీ భోంచేశాడా"

"తిన్నాడు. నిద్రపోయాడు కూడా" అంది వసంత.

ఇద్దరూ భోంచేశారు. రంగనాథం పడగ్గదిలోకెళ్ళి మంచమెక్కాడు. కాసేపు పుస్తకం చదివాడు. పక్కనే పడుకున్న గోపీ వంక చూశాడు. 'పదేళ్లొచ్చినా ఇంకా ఎంత అమాయకంగా వున్నాడు' అనుకున్నాడు. 'వీడికి చదువు బాగా రావాలి. ఎలాగయినా వాడికది నేర్పాలి' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు.

వసంత వంట గది తలుపేసి వచ్చి, లైటార్పి పడుకుంది.

రంగనాథం కళ్ళు మూసుకున్నాడే కానీ, నిద్ర రావడం లేదు. మనసులో ఏదో అశాంతి. కొంత సేపటికి అశాంతిని అలసట గెలిచింది.

ఆఫీసరు రూమ్ ఆధునికంగా వుంది. ఎత్తైన పెద్ద కుర్చీ సింహాసనంలా వుంది. దానిమీద బలిసిన ఓ నక్క కూర్చుని వుంది. అటూఇటూ చూసి ఒళ్ళు విరుచుకుంది. టేబుల్ మీదున్న పేపర్ వెయిట్‌ను కాసేపు గిరగిరా తిప్పింది. విసుగ్గా మొహం పెట్టి కాలింగ్‌బెల్ మోగించింది. ఆఫీసు బోయ్ వినయంగా తలుపు తీసుకుని వచ్చి నిలబడ్డాడు.

"ఎ.ఆర్.ను వెంటనేరమ్మను".

బోయ్ "అలాగే సార్" అంటూ వెళ్ళిపోయాడు.

చెవులు వాల్చి, నాలుక చాపి గబగబా ఓ కుక్క లోపలికెళ్ళింది.

"ఏదీ ఫైలు" కళ్ళు మిటకరిస్తూ నక్క.

"వెదుకుతున్నాను సార్" అంది కాళ్ళు రెండూ ముందుకు వంచి, చొంగ కారుస్తూ, తోక వూపుతూ కుక్క.

నక్క కోపంగా కుక్క వంక చూసింది. కుక్క భంగిమ నక్కకు నచ్చింది. తోక వూపడం మరీ నచ్చింది. దాంతో నక్కకు కోపం తగ్గింది.

"ఆ ఫైలు చాలా అర్జంటు. త్వరగా పట్రా" అంది శాంతంగానే అయినా ఆజ్ఞాపిస్తున్న గొంతుకతో నక్క.

తలూపి, "ఒక్క ఎగురు ఎగిరి ఓ పీకుపీకేద్దామా" అనుకుని, "తప్పుకదా" అనుకుంటూ బయటికెళ్ళింది కుక్క.

రంగనాథానికి మెలకువ వచ్చేసింది. కలలో నక్క మొహం తన ఆఫీసర్‌దే. కుక్క మొహం తనదే! ఛీ ఛీ, ఇలాంటి కలొచ్చిందేమిటి?

అతను లేచి లైట్ వేసి, టైమ్ చూశాడు. నాలుగయింది.

"ఇప్పుడింకేం నిద్ర పడుతుంది" అనుకుంటూ పుస్తకం తీశాడు. అయిదు గంటల వరకూ చదివాడు. ముఖం కడుక్కుని, బట్టలేసుకుని మార్నింగ్ వాక్‌కు బయల్దేరాడు.

గాలి చల్లగా హాయిగా వుంది. పల్చగా మంచు ఇంకా పడుతోంది. అప్పుడో లారీ, అప్పుడో కారు అతని వెనుకనుంచో, ముందు నుంచో వెళ్తున్నాయి.

రంగనాథం ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఆరు గంటలయింది. గోపీ అరుగుమీద కూర్చుని వున్నాడు. తండ్రిని చూడగానే "గడ్డం గీసుకో" అని సంజ్ఞ చేశాడు.

"అలాగే గీస్తాను కానీ, చెయ్యేలా వుందో చూడనీ" అని రంగనాథం, గాయాన్ని చూసి,

"నొప్పెడుతోందా" అని అడిగాడు.

లేదన్నట్టు తలూపాడు గోపీ నవ్వుతూ.

రంగనాథం కాసేపు పేపరు చూశాడు. తర్వాత గడ్డం గీసుకున్నాడు.

గోపీ, తండ్రి ముందుకొచ్చి, బొటన వేలు, చూపుడు వేలు రింగులా కలిపి, కంటి దగ్గర పెట్టి, సినిమా కెల్దామా అని సంజ్ఞ చేశాడు. వెళ్తామన్నాడు రంగనాథం. మళ్ళీ చూపుడు వేలుకు బొటన వేలుతో రాస్తూ "డబ్బులున్నాయా" అని అడిగాడు గోపి. రంగనాథం నవ్వి "ఉన్నాయిలే" అన్నాడు.

గోపీ కూడా నవ్వుతూ చప్పట్లు కొట్టాడు.

రంగనాథం గోపీ బుగ్గలు నిమిరి, బాత్ రూమ్ కెళ్ళాడు. అతను స్నానం చేసి వచ్చేటప్పటికి వసంత టిఫెన్ టేబుల్ మీద పెట్టింది. రంగనాథం అది తిని, గబగబా బట్టలేసుకున్నాడు. వసంత కేరియర్ ఇచ్చింది. దాన్ని పట్టుకుని రంగనాథం ఆఫీసుకు బయల్దేరాడు. వీధి మలుపు తిరగబోయే సరికి రంగనాథాన్ని పక్కవీధి ఎల్లారావు పలకరించాడు.

"చాలా రోజులకు కలిశాం సార్. అదీ నాకీవేళ లేటయ్యింది. కాబట్టి కలవగలిగాం"

"అవును, లేకపోతే ఈ పాటికే మీరు వెళ్ళిపోయుండేవారు" అన్నాడు రంగనాథం నవ్వుతూ.

అతను కూడా నవ్వి గబగబా నడిచాడు. రంగనాథం అతన్ని అనుసరించాడు. తనూ వేగంగా నడిచే ప్రయత్నం చేస్తూ. ఇద్దరూ ఓ ఇరవై నిమిషాలకు బస్‌స్టాఫ్ చేరుకున్నారు.

చిరు ఎండ చిటపటమనిపిస్తోంది. గాలి సమ్మె చేసినట్టుంది.

"టైమ్ ఎంతయిందండీ"

"ఎనిమిదింపావు".

"అమ్మో, చాలా లేటయిపోయింది. మా ఓనరు కోతిలా ఎగురుతాడు".

"మీరు సాధారణంగా లేటుగా వెళ్ళరుకదా. అంచేత ఒక రోజు లేటయినా ఫర్వాలేదనుకుంటా".

"భలేవారే. మీలా పెర్మనెంట్ ఉద్యోగం కాదుగా. ఏ రోజుకారోజే. దినదినగండం అంటే ఇదేనండి. మా ఓనరుడు పరమ కోపిష్టండి. నోటికేం వస్తే అదే అనేస్తాడు. నోరిప్పితే బూతులు సార్. మీ కంపెనీలో ఏదన్నా ఖాళీవుంటే చూడండిసార్".

"అలాగే చూద్దాం" అన్నాడు రంగనాథం తనేం చేయలేనని తెలిసీ.

కాసేపటికి బస్సు వచ్చింది. తోపులాట మొదలైంది. ఎలాగయితేనేం ఇద్దరూ బస్సులోకి చొరబడ్డారు. లోపల నిలబడ్డానికి చోటు లేదు. ఇరుకు. బస్సు ఇరుకు. బతుకు ఇరుకు. మనసు ఇరుకు.

రంగనాథం జిల్లా కోర్టు స్టాఫ్ రాగానే అతికష్టం మీద బస్సు దిగాడు. మళ్ళీ నడక. ఏ వాహనం మీదకొచ్చేస్తుందో అనే భయం.

ఆఫీసుకెళ్ళగానే ఓ గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు. ముఖానికీ చేతులకీ పట్టిన చెమట తుడుచుకున్నాడు. తన సీటు దగ్గరకెళ్ళి కూర్చున్నాడు. ఓ ఫైలు తీసి డ్రాఫ్టు రాయడం మొదలెట్టాడు.

"సార్. అయ్యగారు ఫైలు తీసుకుని మిమ్మల్ని రమ్మన్నారు" అన్నాడు అటెండర్.

ఆ మాటకు రంగనాథంతో పాటు మిగతా ఉద్యోగులూ తలెత్తారు. 'అయ్యో పాపం' అన్నట్టు అతన్ని సానుభూతితో చూశారు.

రంగనాథం ఫైలు పట్టుకుని ఆఫీసరు గదిలోకెళ్లాడు.

"నమస్కారం సార్" అన్నాడు రంగనాథం వినయం ధ్వనించే గొంతుతో.

"ఆ డ్రాఫ్టు పూర్తయిందా".

"అయింది సార్. ఇదిగో" అని రంగనాథం ఆఫీసరు ముందుంచాడు ఫైలు.

"ఏవిటయ్యా ఈ డ్రాఫ్టింగ్. ఇక్కడ బీయింగ్ అనే వర్డ్ ఎందుకు" అన్నాడు ఆఫీసరు అదోలా మొహం పెట్టి.

రంగనాథం మాట్లాడలేదు. ఆఫీసరు వంక ఓసారి చూసి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. రాత్రి కల గుర్తొచ్చింది. నవ్వు రాబోతుంటే ఆపుకున్నాడు.

'బీయింగ్ అనే వర్డ్ అక్కడెందుకో ఇంగ్లీషు గ్రామర్ వచ్చిన వాళ్ళకు తెలుస్తుందిరా నక్కా' అందామనుకుని అనలేకపోయాడు.

"దీన్ని టైపిస్ట్‌కి ఇచ్చి అర్జంటుగా చేసి తెమ్మను. డ్రాఫ్టింగ్ నీట్‌గా చేయడం నేర్చుకో" అని ఫైలును టేబుల్ కొసకు తోశాడు ఆఫీసరు.

"నమస్తే వస్తాను సార్" అని రంగనాథం రూమ్ బయటికొచ్చాడు.

అతని ముఖం మాడిపోయి వుందో లేదోనని కొందరు ఆసక్తిగా చూశారు. రంగనాథం టైపిస్టుకి డ్రాఫ్టు ఇచ్చి, అర్జంటని చెప్పి, తన సీటులో కూర్చుని మరో ఫైలు తీశాడు.

మధ్యాహ్నం ఒంటిగంట కాగానే, ఫైలుమూసి, కుర్చీలోంచి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు రంగనాథం. ఇతర ఉద్యోగులూ లేచారు. ఆ పక్కనే వున్న గదిలోకెళ్ళి, కేరియర్లు విప్పుకుని భోజనం ప్రారంభించారు.

"ఆఫీసరు తిట్టాడా".

"లేదు"

రంగనాథం మాటను మిగతా వాళ్ళెవరూ నమ్మలేదు. ఆఫీసరుతో తిట్లు తినడం అక్కడందరికీ మామూలే.

భోంచేస్తూ కొత్తగా రిలీజయిన సినిమాల గురించి మాట్లాడుకున్నారు. తర్వాత మళ్ళీ తమ పనుల్లో పడ్డారు.

ఆఫీసవగానే రంగనాథం ఇంటికి బయల్దేరాడు. జిల్లా కోర్టు దగ్గరకొచ్చేటప్పటికి తన వూరివాళ్ళు కొందరు ఎదురయ్యారు.

"ఏవిటిలా వచ్చారు" అని అడిగాడు రంగనాథం.

"జానకి రామయ్యగారి కేసులో సాక్ష్యం ఇవ్వడానికి వచ్చామండి" అన్నాడు వాళ్లలో ఒకడు.

రంగనాథానికి ఆ మధ్య పేపరల్లో చదివిన ఆ కేసు గుర్తొచ్చింది. జానకి రామయ్యకు మొదటి నుంచీ నీతి, న్యాయం లేవు. తమ వూర్లో అతనే పెద్ద భూస్వామి. ఆ వూరి

సర్పంచ్ కూడా అతనే. ఆ మధ్య తన ప్రత్యర్థుల వరి కుప్పల్ని బూడిద చేయించాడని వార్తలొచ్చాయి.

"సాక్ష్యం ఎవరి వైపు ఇచ్చారు. ఆయనే ఆ దుర్మార్గం చేశాడని విన్నాను" అన్నాడు రంగనాథం

వాళ్ళెవరూ మాట్లాడలేదు.

"తప్పు ఆయనదే కదూ" రంగనాథం రెట్టించి అడిగాడు.

"అదంతా పెద్దోళ్ళ యవ్వారమండి. ఏదో ఆయన ఉప్పు తింటున్నవాళ్లం" అన్నాడొకడు.

రంగనాథం మౌనంగా వుండిపోయాడు. అంతలో బస్సు వచ్చింది. వాళ్ళకు చెప్పి, గబుక్కున బస్సెక్కాడు. బస్సు మరీ రద్దీగా లేదు. అయినా రంగనాథానికి చిరాగ్గా వుంది. తర్వాత స్టేజిలో ముందు సీటు ఖాళీ అయితే, అక్కడ కూర్చున్నాడు. కూర్చున్నాక కాళ్ళ నొప్పులు తెలిశాయి. మెదడుకీ ఏదో నొప్పి!

బస్సుదిగి, నెమ్మదిగా నడుస్తున్న రంగనాథంలో రకరకాల ఆలోచన్లు. ఇంటి మెట్లెక్కుతుంటే, గోపీ ఎదురొచ్చాడు.

రంగనాథం చొక్కా విప్పి హేంగర్‌కు తగిలిస్తూ, "వసంతా, ఇవేళ స్కూల్లో గోపీ కేమీ కాలేదుకదా" అని అడిగాడు.

"పైకేమీ కనిపించలేదు మరి" అంది కాఫీ పట్టుకొస్తూ వసంత.

ఆ రోజు ఎదురైన వ్యక్తులూ, సంఘటనలూ, సన్నివేశాలూ, రంగనాథం కళ్లముందు కదిలాయి. అతని, గుండెలో ఏదో గుబులు.

"గోపీకన్నా ఎదుర్కోవడం నేర్పాలి" అనుకున్నాడు కళ్ళు మూసుకుని.

కొద్దిక్షణాల తర్వాత కళ్ళు తెరచి గోపీ వంక చూశాడు. అతనికి ఈ లోకం గోపీలాగ కనిపించింది.

*జూలై 1993, రచన మాసపత్రిక*